SK1 one NEWS HD
www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com
ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.
సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
# సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT
ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 840 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | మంగళవారం 30-06-2026

## వీబీ జీ రామ్ జీ పథకంపై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క

- జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న సీతక్క
- కొత్త పథకం ప్రవేశపెడితే మొత్తం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని వ్యాఖ్య
- పీఎం ఆవాస్ యోజన కింద తక్షణమే గృహాలను మంజూరు చేయాలని విన్నపం



**హైదరాబాద్ :** వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర - మిగతా 2 లో

## ఢిల్లీని కాలుష్య రహిత రాజధానిగా మార్చడమే ప్రధాన లక్ష్యం

- 'ఢిల్లీ ఈవీ పాలసీ 2026'కు ఢిల్లీ కేబినెట్ ఆమోదం
- వినియోగదారులకు రూ.15,000 కోట్ల మేర ప్రయోజనాలు కల్పన
- ఎలక్ట్రిక్ వాహనాలకు 100 శాతం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు
- జూలై 1 నుంచి కొత్త పాలసీ అమల్లోకి వచ్చే అవకాశం




**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. "ఢిల్లీ ఈవీ పాలసీ 2026"కు తమ కేబినెట్ ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి రేఖా గుప్తా సోమవారం ప్రకటించారు. ఈ కొత్త విధానం - మిగతా 2 లో



## గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాం

- ఏపీ హోంమంత్రి అనిత
- ఆస్తులు జప్తు చేశాం
- గంజాయి సాగును రికార్డు స్థాయిలో సున్నాకు చేర్చామన్న అనిత
- దీని కారణంగా క్రైమ్ రేటు 14 శాతం తగ్గిందని వెల్లడి
- ఈగిల్ వింగ్ అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందని కితాబు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న కఠిన నిర్ణయాల వల్ల రాష్ట్రంలో గంజాయి సాగును రికార్డు స్థాయిలో దాదాపు సున్నాకు చేర్చామని, దీని కారణంగా ఏపీలో నేరాల రేటు ఏకంగా 14 శాతం తగ్గిందని ఏపీ హోంమంత్రి - మిగతా 2 లో

## ఖమేనీ అంత్యక్రియలకు
# మోదీ దూరం

- ఖమేనీ అంత్యక్రియలకు భారత్ ప్రతినిధులు
- జులై 4న ఖమేనీ అంతక్రియలు ప్రారంభం
- ఆ సమయంలో ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటనకు మోదీ
- భారత్ తరపున బిహార్ గవర్నర్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి



**ఢిల్లీ :** ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకావడం లేదు. ఆయన స్థానంలో బీహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్, కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గెరిటా భారత ప్రతినిధులుగా పాల్గొననున్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఇటీవల - మిగతా 2 లో



2 లో

## హర్మ్యూజ్ సంక్షోభంలో భారత్ విజయం

- టోల్ చెల్లించకుండా 12 నౌకలు ఇండియాకు
- హర్మ్యూజ్ మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం
- పలు దేశాల నుంచి ముడి చమురు తెప్పించామని వెల్లడి
- దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా పెంచామన్న మంత్రి

## ప్రభుత్వ స్కూళ్లలో సీట్ల కోసం రికమెండేషన్ అడిగే రోజులు వచ్చాయి



- రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్
- షైనింగ్ స్టార్లే ప్రభుత్వ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్లు అన్న మంత్రి లోకేశ్
- వచ్చే ఏడాది ప్రైవేటు నుంచి 2 లక్షల మందిని ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించడమే లక్ష్యం
- విద్యార్థుల కోణం నుంచే విద్యాశాఖలో సంస్కరణలు చేపట్టామని వెల్లడి

**అమరావతి :** వచ్చే ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి కనీసం రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరాలన్నదే తన లక్ష్యమని, ఈ మార్పునకు 'షైనింగ్ స్టార్లే' బ్రాండ్ అంబాసిడర్లని రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. భవిష్యత్తులో దేశం మొత్తం ఏపీ విద్యా నమూనా గురించే మాట్లాడు కోవాలని ఆకాంక్షించారు. గత సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 'షైని ంగ్ స్టార్స్' పేరుతో ఘనంగా సత్కరించారు. తాడేపల్లిలోని సీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో టెన్త్ టాపర్లు - మిగతా 2 లో




## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే

- ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించిన రాజ్యసభ ఛైర్మన్
- ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు ఎన్నికైన ఖర్గే
- రాజ్యసభ సభ్యునిగా ప్రమాణం చేసిన మల్లికార్జున ఖర్గే
- ఈనెల 26నుంచి అమల్లోకి రానున్న ఖర్గే నియామకం

**ఢిల్లీ :** రాజ్యసభకు తిరిగి ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతగా మళ్లీ గుర్తింపు పొందారు. ఆయన పదవీకాలం ఈనెల 25తో ముగియనుండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించారు. ఈనెల 26నుంచి - మిగతా 2 లో

## అమరావతి నిర్మాణంలో
# భాగమైనందుకు గర్వపడాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వించండి
- అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలన్న సీఎం
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు ఆదేశం
- రూ.50,999 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడి
- ప్రతి రెండు నెలలకు ఒకసారి పనుల పురోగతిపై సమీక్ష జరుపుతామన్న చంద్రబాబు
- అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలు ఐకానిక్‌గా ఉండాలని సూచన



**అమరావతి :** దేశం గర్వించే రాజధాని అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని, ఇది కేవలం కట్టడాల నిర్మాణం కాదని, ఓ చరిత్ర నిర్మాణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టు సంస్థలు, తాము ఒక బ్రాండ్‌ను సంపాదిస్తున్నామన్న భావనతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "హైదరాబాద్ ప్లస్‌గా అమరావతిని నిర్మిస్తున్నాం. ఇది యావత్ దేశానికి గర్వకారణంగా నిలవాలి. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో మేం భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టర్లు - మిగతా 2 లో

## ఒకవైపు శాంతి మంత్రం
# మరోవైపు రక్తపాతం!

- ఆఫ్ఘనిస్థాన్‌లోని మూడు జిల్లాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు
- వివాదాస్పద 'డబుల్ ట్యాప్' వ్యూహంతో దాడిలో 35 మంది మృతి
- ఉగ్రవాద స్థావరాలపైనే దాడులని పాక్ వాదన
- పౌరులు మరణించారని ఆఫ్ఘన్ ఆరోపణ



**ఢిల్లీ :** అంతర్జాతీయ వేదికపై అమెరికా, ఇరాన్ మధ్య శాంతిని నెలకొల్పేందుకు మధ్యవర్తిత్వం వహిస్తూ ప్రశంసలు అందుకుంటున్న పాకిస్థాన్, సొంత సరిహద్దుల్లో మాత్రం భీకర దాడులకు పాల్పడుతోంది. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో పాక్ సైన్యం తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో కనీ సం 35 మంది మరణించారు. - మిగతా 2 లో

## భారీ వర్షాల ఎఫెక్ట్.. సీఎం రేవంత్ సభ రద్దు


2 లో

- భారీ వర్షాల కారణంగా మధిర సభ రద్దు
- సీఎం రేవంత్ సభను హైదరాబాద్‌కు మార్చిన ప్రభుత్వం
- శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'
- మంగళవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం
- రైతు వేదికల నుంచి వర్చువల్‌గా రైతుల భాగస్వామ్యం




## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- వాటితోనే రేవంత్ గెలిచారా?
- దేశ వ్యాప్తంగా ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందన్న కవిత
- బోధన్ లో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని వెల్లడి
- హైదరాబాద్‌లో ఉండే చాలా మందికి ఏపీలో కూడా ఓట్లు ఉన్నాయన్న కవిత

## నేటి నుంచి రైతుభరోసా
# నిధుల విడుదల

- తొలివిడతలో 41.37 లక్షల మంది అన్నదాతలకు లబ్ధి
- నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల చేస్తామన్న మంత్రి తుమ్మల
- నేడు 2 ఎకరాల వరకు రైతుభరోసా నిధుల జమ
- మిగతావారికి దశలవారీగా విడుదల చేస్తామన్న మంత్రి
- దశలవారీగా నిధులు జమ




**హైదరాబాద్ :** రైతుభరోసా నిధుల విడుదలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల చేస్తామని తెలిపారు. అర్హులైన అన్నదాతల ఖాతాల్లో దశలవారీగా నిధులు జమచేస్తామని చెప్పారు.రైతుభరోసా నిధుల విడుదల కోసం ఖమ్మం జిల్లా మధిరలో రైతు ఆశీర్వద సభను నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. తొలి విడత నిధులు జమచేయాలని ప్లాన్ చేసింది. అయితే ఖమ్మంలో కురిసిన భారీ వర్షానికి ఏర్పాటుచేయాలని భావించిన రైతు మేళా,కార్యక్రమం కోసం ఏర్పాటుచేసిన సభా ప్రాంగణం వద్ద ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రైతు మేళా, రైతు ఆశీర్వాద సభను రద్దు చేసింది.రైతు భరోసా నిధుల విడుదల కోసం రైతు ఆశీర్వాద సభకు బదులుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించాలని సీఎం ఆదేశించారు.అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద తొలి విడతలో 2 ఎకరాల వరకు నిధులు విడుదల చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నేడు 41.37 లక్షల మంది రైతుల కోసం, రూ.2,482 కోట్లు విడుదల చేస్తామన్నారు. మిగతావారికి

# సంపాదకీయం

## 'గుర్తింపు' బాధలు!



భారత ప్రభుత్వం జారీచేసిన పాస్‌పోర్టు ఉన్నంతమాత్రాన భారతీయ పౌరులు కాబోరని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటన పెద్ద దుమారం రేపింది. మాధ్యమాల్లో తీవ్రవర్గోపవర్గులకు తోడుగా సోషల్ మీడియాలో జోకుల వర్షం కురుస్తోంది. ఇంతోటిదానికీ, పాస్‌పోర్టు జారీకి సంక్లిష్టమైన ప్రక్రియలూ పోలీసు వెరిఫికేషన్లతో ప్రజలను వేధించడం ఎందుకని కొందరు ఎగతాళి చేస్తున్నారు. పైగా, పాస్‌పోర్టు సేవాదివస్ సందర్భంగా కేంద్ర విదేశాంగశాఖ ఈ వ్యాఖ్యలు చేస్తూ, అది కేవలం విదేశీప్రయాణాలకు వీలుకల్పించే అనుమతిపత్రమే తప్ప, అది ఉన్నంతమాత్రాన ఈ దేశ పౌరసత్వం వచ్చేసినట్టు కాదని వ్యాఖ్యానించింది మరీ వివాదం రేపింది. భారతీయ పౌరసత్వానికి ఇప్పుడు ఏకైక రుజువు ఏదంటూ కావడమా అని ఒకరు ప్రశ్నిస్తే, బీజేపీ ఓటర్లైతే పౌరుడేనని మరొకరన్నారు. ఇంతకాలమూ నా దగ్గర ఆధార్ ఉన్నా, ఓటరు కార్డున్నా నేను పౌరుడిని కాదు పొమ్మన్నారు, ఇప్పుడు పాస్‌పోర్టును కూడా ఆ జాబితాలో చేర్చారు, పుట్టుకనుంచి చావు వరకూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న అన్నేసి పత్రాల్లో ఏ ఒక్కటైనా నన్ను ఈ దేశపౌరుడిగా గుర్తిస్తుందా? అని ఒక జర్నలిస్టు సోషల్ మీడియాలో వాపోయారు. ఈ దేశపౌరులు గుర్తింపు సంక్షోభంలో ఉన్నారన్న వ్యాఖ్య ఈ పరిస్థితికి చక్కగా అతుకుతుంది. ఓటరు కార్డు మంజూరు చేసిన ఎన్నికల సంఘం అది గుర్తింపు కార్డు మాత్రమేననీ తీసిపారేసింది. ప్రభుత్వం అన్నింటికీ ఆధార్‌ని ఆధారం చేసినప్పటికీ, అది కూడా పౌరసత్వానికి రుజువు కాదన్నది. జననం, శాశ్వత నివాసం అనే రెండు మూలాధార పత్రాలతో సహా సవాలక్ష రుజువులు చూపితే కానీ మంజూరు కాని పాస్‌పోర్టు సైతం ఇప్పుడు ఆ జాబితాలో చేరడం పౌరసమాజానికి ఆగ్రహం కలిగిస్తోంది. పాస్‌పోర్టు కేవలం విదేశీ ప్రయాణపత్రం అయితే, అక్కడి పౌరసత్వం తీసుకున్నవారు ఇక్కడ దానిని తిరిగి వెనక్కు ఇచ్చేయాలన్న నిబంధన ఎందుకు ఉన్నట్టు? ఒకరి పాస్‌పోర్టు రద్దయినా, నిషేధించినా, దానిని ఉపసంహరించుకున్నా అది ప్రభుత్వానిది అయిపోయినట్లేనని నిబంధనల్లో అంత ప్రత్యేకించి ఎందుకు రాసినట్టు? ఇత్యాది ప్రశ్నలు అనేకం వినిపిస్తున్నాయి.స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలవుతున్నా, ఎవరు భారత పౌరుడు అన్న ఈ మౌలిక ప్రశ్న ఇంకా మిగిలేవుండటం దీని అర్థం. పౌరసత్వాన్ని నిర్ధారించే సార్వత్రిక, సర్వామోదిత పత్రం ఒక్కటీ ఇప్పటికీ లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమే. ఒకవైపు ఉగ్రవాదం, తీవ్రవాదం, పొరుగు దేశాల నుంచి అక్రమవలసలు, చొరబాట్ల గురించి తీవ్రమైన వ్యాఖ్యానాలు చేస్తూ, ఎన్నికల్లో అత్యధికంగా లబ్ధిపొందుతూ, మరోపక్క పౌరులు కావాల్సిన పేరిట లక్షలాదిమందిని ఓటరు జాబితాలనుంచి తొలగిస్తూ ఎవరు పౌరులన్న ఈ ప్రశ్నకు మాత్రం సమాధానం లేకుండా వదిలేయడం విచిత్రం. అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ల నుంచి 2014 డిసెంబరు 31కి ముందు ఈ దేశంలోకి వచ్చినవారికి కూడా పౌరసత్వాన్ని కట్టబెడుతూ, ఇక్కడ పాస్‌పోర్టులు ఉన్నంతమాత్రాన పౌరులు కానక్కరలేదని అనడం ఆశ్చర్యమే. పౌరసత్వానికి అంతిమంగా ఇదీ లేకుండా చేసి, దానిని నిరూపించుకోవాల్సిన బరువు మాత్రం జనం మీదకు నెట్టేయడం విషాదం. రేషన్‌కార్డు, ఓటరుకార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రభుత్వాలు మంజూరు చేసేవి సంఖ్యానేకం. ఇవన్నీ ఒకదాని ఆధారంగా మరొకటి మంజూరు అవుతూ పరస్పరం ముడిపడివున్నవే. అయినప్పటికీ, ఈ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఆ జాబితాలో ఏ ఒక్కటీ మనలను పౌరుడిగా గుర్తించదు, మరేది నిశ్చయంగా నిర్ధారిస్తుందో తెలియదు. ఆధార్ ప్రాజెక్టు ఆరంభిస్తున్నప్పుడు, దానిని బలవంతంగా ప్రభుత్వ సేవలతో అనుసంధానిస్తున్నప్పుడూ పాలకులు చాలా మాటలు చెప్పారు. ఇటీవలివరకూ పాస్‌పోర్టుకు కూడా మూలాధారం ఆధార్ నెంబరే కానీ, ఇప్పుడు అదీ పనికిరాకుండా పోయింది. సహజంగా అధికారులు ఆయా సందర్భాలను బట్టి ఏవో పత్రాల మీద ఆధారపడతారు. కానీ, రాజకీయ అవసరాలు, రేపటి ఎత్తులూ జిత్తులు ముందుకువచ్చి ప్రధానమైపోయినప్పుడు ప్రజలకు ఇటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయి. తమ గుర్తింపును నిరూపించుకోవడం వారికి అతిపెద్ద సవాలుగా పరిణమిస్తుంది. పౌరసత్వ రాజకీయాలు కొనసాగుతున్నంతకాలం ఈ అగ్నిపరీక్షలు తప్పవేమో.

## గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాం

**మొదటిపేజీ తరువాయి -** అనిత వెల్లడించారు.రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను కూకటి వేళ్లతో పెకలించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వింగ్ 'ఈగల్' టాస్క్‌ఫోర్స్ క్షేత్రస్థాయిలో అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందని హోంమంత్రి కొనియాడారు. ఈ స్పెషల్ ఆపరేషన్ల ద్వారా ఇప్పటివరకు దాదాపు 1.20 లక్షల కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, శాస్త్రీయ పద్ధతుల్లో పూర్తిగా దహనం చేసినట్లు తెలిపారు. కేవలం మత్తు పదార్థాలను సీజ్ చేయడమే కాకుండా... అంతరాష్ట్ర స్మగ్లర్లకు చెందిన సుమారు రూ. 24 కోట్ల విలువైన ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసిందని వెల్లడించారు.యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు మాఫియాపై ఉక్కుపాదం మోపేలా రాబోయే రోజుల్లో ఏజెన్సీ ఏరియాల్లో తనిఖీలను మరింత తీవ్రతరం చేస్తామని, డ్రగ్స్ సమాచారాన్ని గోప్యంగా అందించడానికి 'ఈగల్' కొత్త వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చామని అనిత తెలిపారు.

## నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల

**మొదటిపేజీ తరువాయి -**దశలవారీగా నిధులు జమచేస్తామని చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అర్హులందరికీ పెట్టుబడి సాయం అందజేయనున్నారు. కొత్తగా పాసుబుక్‌లు వచ్చిన వారు జులై 5లోపు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తుమ్మల చెప్పారు.

## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి



**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ హాట్ టాపిక్ గా మారింది. దీనిపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందని తెలిపారు. బోధన్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని... దీనిపై ఎన్నికల సంఘం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో కేవలం 800 ఓట్లను మాత్రమే తొలగించారని కవిత విమర్శించారు. కానీ తాము క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. అక్కడ ఏకంగా 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు తేలిందని అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి 32 వేల మెజారిటీతోనే గెలిచారని.. ఈ డూప్లికేట్ ఓట్లతోనే ఆయన గెలిచారా? అనే అనుమానం తమకు ఉందన్నారు. సినీనటుడు ప్రకాశ్ రాజ్‌కు రెండు వేర్వేరు చోట్ల ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించడానికి ఏడేళ్ల సుదీర్ఘ సమయం పట్టిందని ఈసీని విమర్శించారు. హైదరాబాద్‌లో ఉండే చాలా మంది ఓటర్లకు అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఓట్లు ఉన్నాయని, ఈ డూప్లికేట్ ఓట్లను తొలగించడంలో అధికారులు ఫెయిల్ అయ్యారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 'సర్' ప్రక్రియ జరుగుతున్నందున.. రాష్ట్రాల మధ్య ఉన్న ఓటర్ డేటాను లోతుగా పరిశీలన చేయాలని కవిత సూచించారు. ఒక పౌరుడికి దేశంలో ఎక్కడైనా ఒకే ఒక్క చోట మాత్రమే ఓటు ఉండేలా చూడాలని అన్నారు. డూప్లికేట్ ఓట్ల స్కామ్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# ప్రభుత్వ స్కూళ్లలో సీట్ల కోసం రికమెండేషన్ అడిగే రోజులు వచ్చాయి

**మొదటిపేజీ తరువాయి -** 55 మందికి రూ. 30 వేల నగదు బహుమతి, ఇంటర్ టాపర్లు 61 మందికి ల్యాప్‌టాప్‌లు, పతకాలు అందజేశారు.ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "నిద్రలో కనిపించేది కల కాదు, మిమ్మల్ని నిద్రపోనివ్వనిదే నిజమైన కల. నిద్రపోకుండా మీరు పడిన కష్టమే మిమ్మల్ని షైనింగ్ స్టార్స్‌గా నిలబెట్టింది. మీరు గెలిచారు, నన్ను గెలిపించారు, మన విద్యావ్యవస్థను గెలిపించారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. మీ పనితీరు వల్ల మంత్రిగా నాకు, 2 లక్షల మంది ఉపాధ్యాయులకు గౌరవం పెరిగింది" అని విద్యార్థులను ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం ఎమ్మెల్యేల సిఫార్సులు అడిగే రోజులు వచ్చాయని, మంగళగిరిలో ఒక తల్లి తనను నిడమర్రు స్కూలులో సీటు ఇప్పించాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.

### విద్యారంగంలో సమూల మార్పులు

విద్యాశాఖను వ్యవసాయంతో పోల్చిన లోకేశ్, ఫలితాలు వెంటనే రావని, నిరంతరం శ్రమిస్తేనే పంట చేతికొచ్చిన ఆనందం దక్కుతుందని అన్నారు. విద్యార్థులను కేంద్రంగా చేసుకుని అనేక సంస్కరణలు చేపట్టామని వివరించారు. "గతంలో పాఠ్యపుస్తకాలపై ముఖ్యమంత్రి, మంత్రుల బొమ్మలుండేవి. నాకు ఆ ఫోటో పిచ్చి లేదు. అందుకే బ్యాగ్‌పై, బెల్ట్‌పై, గుడ్డుపై, స్కూలులో ఎక్కడా బొమ్మలు లేకుండా చేశాం. పాఠశాలల్లో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశాం" అని తెలిపారు. 'వన్ క్లాస్-వన్ టీచర్', డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్, డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేసి భోజన నాణ్యతను మరింత పెంచుతామని హామీ ఇచ్చారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని, 'నో బ్యాగ్ డే' అమలు చేస్తున్నామని తెలిపారు.

### విలువలకే పెద్దపీట

విలువలు లేని సమాజం ప్రమాదకరమని, అందుకే నైతిక విలువల కోసం చాగంటి కోటేశ్వరరావు గారిని సలహాదారుగా నియమించామని లోకేశ్ పేర్కొన్నారు. "అమ్మకు చెప్పలేని పని చేయొద్దు అనే ఆయన మాట చాలా శక్తివంతమైనది. మహిళలను గౌరవించడం ఇంటి నుంచే మొదలుకావాలి. తల్లికి వందనం వంటి కార్యక్రమాల ద్వారా ఆ మార్పునకు శ్రీకారం చుట్టాం" అని చెప్పారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని కలలు కనడంతో పాటు, రాజకీయాల్లోకి వచ్చి సమాజాన్ని మార్చే నాయకులుగా కూడా ఎదగాలని ఆకాంక్షించారు.

### ఓటమి నుంచే పాఠాలు నేర్చుకోవాలి

తన రాజకీయ జీవితాన్ని ఉదాహరణగా చూపుతూ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. "2019లో ఇదే మంగళగిరి నియోజకవర్గంలో ఓడిపోయినప్పుడు బాధ కలిగినా, పట్టుదలతో ఐదేళ్లు పనిచేసి 91 వేల మెజారిటీతో గెలిచాను. జీవితంలో సవాళ్లు ఎదురైనప్పుడు వెనుకడుగు వేయొద్దు. ఫెయిల్ అంటే ఫస్ట్ ఎటెంప్ట్ ఇన్ లెర్నింగ్ అని గుర్తుంచుకోండి" అని సూచించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై లక్ష రూపాయలు ఖర్చు చేస్తోందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. చదువు పూర్తయ్యాక, అవకాశం వచ్చినప్పుడు సొంత పాఠశాలకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారీయా, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే

**మొదటిపేజీ తరువాయి -**

ప్రతిపక్ష నేతగా ఆయన నియామకం అమల్లోకి వస్తుందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ రాజ మోదీ బులెటిన్ విడుదల చేశారు.అంతకుముందు రాజ్యసభ ఛైర్మన్ ఛాంబర్‌లో సోమవారం మల్లికార్జున ఖర్గే ప్రమాణం చేశారు. ఖర్గే చేత రాజ్యసభ ఛైర్మన్ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే తన చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ప్రతిపక్ష నాయకుడిగా తన సేవలను కొనసాగిస్తానని ఖర్గే అన్నారు. రాజ్యసభకు తన పునఃనియమించడాన్ని, ప్రతిపక్ష నాయకుడిగా తనను కొనసాగించడాన్ని అపారమైన గర్వకారణంగా అభివర్ణించారు. అటు అధికారులు, పార్టీ నాయకత్వం, రాజకీయ సహచరులు అందించిన మద్దతుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు."రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసే గౌరవం నాకు లభించింది. రాజ్యసభకు ప్రతిపక్ష నాయకుడిగా సేవలు కొనసాగించడం అపారమైన గర్వకారణం, బాధ్యత. నాకు నిరంతరం మద్దతు అందించిన భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు, డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు. కాంగ్రెస్ నాయకత్వానికి, ముఖ్యంగా సీపీపీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ధన్యవాదాలు. ఇంకా కాంగ్రెస్ పార్టీలోని తోటి సహచరులు, ఎంపీలకు, నా సుదీర్ఘ ప్రజా జీవితం, పార్లమెంటరీ సేవ ప్రయాణంలో అచంచలమైన విశ్వాసం, ప్రోత్సాహంతో నాకు అండగా నిలిచిన లెక్కలేనంత మంది పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు, ముఖ్యంగా ఇండియా బ్లాక్‌లోని సహచరులకు, ఇతర ప్రతిపక్షాల సహకారానికి నేను కృతజ్ఞుడను.'.ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, బీజేపీ నేత తరుణ్ చుగ్ సహా ఎనిమిది మంది నూతన రాజ్యసభ ఎంపీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేయగా, మిగిలిన ఏడుగురు సభ్యులు రాజ్యసభ ఛాంబర్‌లో ప్రమాణం చేశారు.నూతనంగా ప్రమాణం చేసిన వారిలో జితేంద్ర మేఘ్‌జీభాయ్ కంజారియా, మాన్‌సింగ్ మేరామన్ పర్మార్ (గుజరాత్), ఎం. నాగరాజ (కర్ణాటక), రాజేంద్ర హీరాలాల్ జైన్ (మహారాష్ట్ర), అధికారిమయుమ్ శారదా దేవి (మణిపూర్), అల్కా సింగ్ (రాజస్థాన్) ఉన్నారు. ఛైర్మన్ ఛాంబర్, సభలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, సభ నేత జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాల్గొన్నారు.

# ఒకవైపు శాంతి మంత్రం.. మరోవైపు రక్తపాతం!

**మొదటిపేజీ తరువాయి -** మృతులంతా ఉగ్రవాదులేనని పాకిస్థాన్ వాదిస్తుండగా, అమాయక పౌరులు, చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని ఆఫ్ఘనిస్థాన్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో పాక్ సైన్యం అనుసరించిన వివాదాస్పద 'డబుల్ ట్యాప్' వ్యూహం తీవ్ర విమర్శలకు దారితీసింది.

### ఏమిటీ 'డబుల్ ట్యాప్' దాడి?

సైనిక పరిభాషలో 'డబుల్ ట్యాప్' అంటే ఒకే ప్రదేశంపై కొద్ది వ్యవధిలో రెండోసారి దాడి చేయడం. ఇది అత్యంత క్రూరమైన, అమానవీయమైన వ్యూహంగా పరిగణిస్తారు. ఎందుకంటే, మొదటి దాడి తర్వాత సహాయక చర్యల కోసం వచ్చే సిబ్బంది, వైద్యులు, పౌరులను లక్ష్యంగా చేసుకుని రెండో దాడి జరుపుతారు. భారత కాలమానం ప్రకారం నిన్న అర్ధరాత్రి 12:30 గంటలకు పాక్ వైమానిక దళం (పీఏఎఫ్) జెట్లు ఆఫ్ఘనిస్థాన్‌లోని పక్తికా, పక్తియా, కునార్ జిల్లాల్లోని ఇళ్లు, మసీదులపై బాంబులు వేశాయి. సరిగ్గా 25 నిమిషాల తర్వాత అంటే 12:55 గంటలకు, శిథిలాల కింద చిక్కుకున్న మహిళలు, పిల్లలను కాపాడేందుకు గ్రామస్థులు పరుగెత్తుకురాగా, పాక్ జెట్లు మళ్లీ విరుచుకుపడి వారిపైనే రెండోసారి బాంబుల వర్షం కురిపించాయి. ఈ రెండో దాడి కారణంగానే మృతుల సంఖ్య అనూహ్యంగా పెరిగి, వందకు పైగా క్షతగాత్రులతో ఆసుపత్రులు నిండిపోయాయి.

### పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ వాదనలు

గతవారం కరాచీలో తమ సైనిక దళాలపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) నుంచి విడిపోయిన జమాత్-ఉల్-అహ్రార్ ఉగ్రవాదుల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపామని, ఇందులో 29 మంది ఉగ్రవాదులు హతమయ్యారని పాక్ సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తారర్ తెలిపారు.అయితే, పాకిస్థాన్ వాదనను ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపందల చర్య అని, పాక్ దురాక్రమణకు పాల్పడిందని తాలిబన్ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ మండిపడ్డారు. ఈ దాడుల్లో 35 మందికి పైగా అమాయక పౌరులు మరణించారని, వీరిలో 4 నుంచి 9 ఏళ్ల వయసున్న చిన్నారులు, వృద్ధులు ఉన్నారని ఆయన తెలిపారు. "దాడి జరిగినప్పుడు ఆ ప్రాంతంలో ఎలాంటి ఉగ్రవాదులు లేరు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న మాపైనే రెండోసారి బాంబు వేశారు. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాకిస్థాన్ అబద్ధాలు చెబుతోంది" అని దాడిలో గాయపడిన ఒక స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశాడు. 2021లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాక్-ఆఫ్ఘన్ సంబంధాలు ఉద్రిక్తంగానే ఉన్నాయి. సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తుండగా, తమ భూభాగంలో ఉగ్రవాదులు ఎవరూ లేరని తాలిబన్లు స్పష్టం చేస్తున్నారు. గత 9 నెలల్లో పాకిస్థాన్ జరిపిన దాడుల్లో సుమారు 570 మంది అమాయక ఆఫ్ఘన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారని నివేదికలు చెబుతున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ శాంతి దూతగా వ్యవహరిస్తూ, మరోవైపు పొరుగు దేశంపై దాడులకు పాల్పడటం పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తోంది.

## వీబీ జీ రామ్ జీ పథకంపై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క



**మొదటిపేజీ తరువాయి -** అభ్యంతరాలు ఉన్నాయని మంత్రి సీతక్క కేంద్రానికి తెలియజేశారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న ఆమె... తెలంగాణలో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాల వివరాలను కేంద్రానికి వివరించారు.జులై 2న వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా? లేక కొత్త పథకం తీసుకురావాలా? అనే అంశంపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని సీతక్క ప్రకటించారు. కొత్త పథకం ప్రవేశపెడితే 100 శాతం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని, ఇది సమస్యాత్మకమని కేంద్రానికి తెలియజేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో 100 శాతం వేతనాల విధానం కొనసాగించాలని, మెటీరియల్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్ర వాటా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పీఎం ఆవాస్ యోజన కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో కేటాయింపులు లేవని... ఆ పథకం కింద తక్షణమే గృహాలు మంజూరు చేయాలని సీతక్క కోరారు. పీఎంజీఎస్‌వై రోడ్లకు అటవీ అనుమతులు ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. తెలంగాణలో జల్ సంచార్ విభాగంలో 13 జాతీయ అవార్డులు సాధించడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు.

## ఢిల్లీని కాలుష్య రహిత రాజధానిగా మార్చడమే ప్రధాన లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి -** జూలై 1 నుంచి అమల్లోకి వచ్చి, 2030 మార్చి 31 వరకు కొనసాగే అవకాశం ఉందని ఆమె తెలిపారు.ఈ పాలసీ ద్వారా రాబోయే నాలుగేళ్లలో పౌరులకు సుమారు రూ. 15,000 కోట్ల ప్రయోజనాలు చేకూరుతాయని సీఎం వివరించారు. ఇందులో భాగంగా, ప్రభుత్వం నేరుగా రూ. 7,000 కోట్లను ఛార్జింగ్ స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేయనుంది. మరో రూ. 8,000 కోట్లను పన్ను మినహాయింపులు, ప్రోత్సాహకాల రూపంలో ఈవీ వినియోగదారులకు అందిస్తుంది. లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు ఆమోదం తర్వాత ఈ పాలసీ అధికారికంగా అమల్లోకి వస్తుంది.ఈ కొత్త పాలసీలో భాగంగా, 2027 జనవరి 1వ తేదీ నుంచి ఢిల్లీలో కొత్త పెట్రోల్ లేదా సీఎన్‌జీ ఆటో రిక్షాల రిజిస్ట్రేషన్‌ను పూర్తిగా నిషేధిస్తారు. ఆ తర్వాత కేవలం ఎలక్ట్రిక్ ఆటోలకు మాత్రమే అనుమతి ఉంటుంది. అదేవిధంగా, 2028 ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త పెట్రోల్, సీఎన్‌జీ టూవీలర్ల రిజిస్ట్రేషన్లను కూడా నిలిపివేయనున్నారు.కొత్త విధానం ప్రకారం, ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసేవారికి 100 శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. కార్ల విషయానికొస్తే, రూ. 30 లక్షల లోపు ఎక్స్-షోరూమ్ ధర ఉన్న వాహనాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, కార్లు, తేలికపాటి గూడ్స్ ట్రక్కులు, గ్రామీణ సేవా వాహనాలతో సహా అన్ని రకాల వాహనాలకు ఈ పాలసీ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.సాధారణ వాహనాలకు, ఎలక్ట్రిక్ వాహనాలకు మధ్య ధర వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ రాయితీలు రూపొందించినట్లు సీఎం రేఖా గుప్తా తెలిపారు. "కాలుష్య రహిత, స్వచ్ఛమైన రవాణా రాజధానిగా ఢిల్లీని మార్చడమే ఈ పాలసీ ప్రధాన ఉద్దేశం" అని ఆమె పేర్కొన్నారు. వాహనాల కొనుగోలును ప్రోత్సహించడమే కాకుండా, పాత వాహనాల తుక్కు (స్క్రాపింగ్), ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ఈ పాలసీ దృష్టి సారిస్తుందని ఆమె వివరించారు. ఈ పాలసీ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన కేబినెట్ మంత్రులు పంకజ్ కుమార్ సింగ్, ఆశిష్ సూద్, మంజిందర్ సింగ్ సిర్సాలను సీఎం అభినందించారు.

## అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలి

**మొదటిపేజీ తరువాయి -** పనిచేయాలి" అని సూచించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువు కంటే ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్లు రాష్ట్రానికి ఐకానిక్ నిర్మాణాలుగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు.( పస్తుతం రాజధాని పరిధిలో రూ.50,999 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్‌ఫ్రా, ఎల్పీఎస్ ఇన్‌ఫ్రాతో పాటు కీలకమైన ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. పనుల వేగవంతానికి అవసరమైన యంత్రాలు, మానవ వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5,140కి పైగా భారీ యంత్రాలు పనుల్లో నిమగ్నమై ఉన్నాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ముఖ్యమంత్రికి వివరించారు. భవిష్యత్తులో వరద ముంపు సమస్యలు తలెత్తకుండా కొండవీటి వాగు, పాలవాగులను వెడల్పు చేస్తున్నామని తెలిపారు.గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేశారని, రెండేళ్లుగా తాము మళ్లీ పనులను గాడిలో పెట్టామని చంద్రబాబు గుర్తుచేశారు. దేశంలోని పవిత్ర క్షేత్రాల నుంచి మట్టి, నీరు తెచ్చి పునీతం చేసిన ఈ ప్రాంతంలో నిర్మాణాలను అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, అయినా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు.నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించేందుకు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం అవుతానని తెలిపారు. నిర్మాణాలు పూర్తయ్యాక, ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ సమీక్షలో సీఆర్డీఏ అధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీ దూరం



**మొదటిపేజీ తరువాయి -** ప్రధాని మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. అయితే ఆ సమయంలో ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటన ఇప్పటికే ఖరారు కావడంతో మోదీ హాజరు కాలేకపోతున్నారు. ఈ షెడ్యూల్ ముందుగానే ఖరారైం దని అధికార వర్గాలు తెలిపాయి.ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఖమేనీ మరణించారు. తొలుత మార్చిలో అంత్యక్రియలు నిర్వహించాలని భావించారు. కానీ ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా వాటిని వాయిదా వేశారు. ఇప్పుడు జులైలో పలువురు దేశాధినేతలు, ప్రతినిధుల సమక్షంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జులై 4న టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా సముదాయంలో ఖమేనీ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. చివరి అంత్యక్రియలు జులై 9న ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లోని ఇమామ్ రెజా దర్గా వద్ద జరగనున్నాయి.

## హర్మూజ్ సంక్షోభంలో భారత్ విజయం

**మొదటిపేజీ తరువాయి -** ప్రపంచాన్ని కుదిపేసిన ఇంధన సంక్షోభ సమయంలో పరిస్థితిని భారత్ సమర్థంగా ఎదుర్కొందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. హర్మూజ్ జలసంధిని దాదాపు నాలుగు నెలలు మూసివేసినా దేశంలో ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. టోల్ చెల్లించకుండానే 12కు పైగా ఎల్‌పీజీ నౌకలను హర్మూజ్ నుంచి తరలించామని వెల్లడించారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని పురీ పేర్కొన్నారు. ముడిచమురు దిగుమతులను ఒక్క దేశానికే పరిమితం చేయకుండా పలు దేశాల నుంచి తెప్పించామని చెప్పారు. దీంతో దేశంలో వంటగ్యాస్, ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడలేదన్నారు.సంక్షోభ సమయంలో దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా భారీగా పెంచామని వివరించారు. ఇంతకుముందు వంటగ్యాస్ ఉత్పత్తి చేయని రిఫైనరీలను కొద్ది రోజుల్లోనే మార్పులు చేసి ఎల్‌పీజీ తయారీకి సిద్ధం చేశామని చెప్పారు. దీంతో రోజుకు 35 వేల మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తిని 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచగలిగామని తెలిపారు.వంటగ్యాస్ కొరత రాకుండా అల్జీరియా, జపాన్, కెనడా వంటి దేశాలతో కొత్త సరఫరా ఒప్పందాలు కుదుర్చుకున్నామని పురీ చెప్పారు. అమెరికా నుంచి అదనపు ఎల్‌పీజీ కార్గోలను కూడా తెప్పించామని వెల్లడించారు. దీంతో దేశీయ అవసరాలను పూర్తిగా తీర్చగలిగామని అన్నారు.ఇంధన ధరల భారం తగ్గించేందుకు కేంద్రం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని గుర్తుచేశారు. అలాగే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు వంటగ్యాస్ పంపిణీలో డిజిటల్ అథెంటికేషన్ విధానాన్ని తప్పనిసరి చేశామని చెప్పారు. ఈ చర్యల వల్ల ప్రపంచ ఇంధన సంక్షోభ ప్రభావం భారత వినియోగదారులపై పడకుండా కాపాడగలిగామని హర్దీప్ పేర్కొన్నారు.

## భారీ వర్షాల ఎఫెక్ట్.. సీఎం రేవంత్ సభ రద్దు

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు ప్రభుత్వ కార్యక్రమాలపైనా ప్రభావం చూపుతున్నాయి. ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రైతు ఆశీర్వాద సభ'ను చివరి నిమిషంలో రద్దు చేశారు. వర్షాల కారణంగా సభను హైదరాబాద్‌కు మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మధిర నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సభను రద్దు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సభను హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించనున్నారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని మంత్రులు, ఉన్నతాధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులు ఇందులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల్లోని రైతు వేదికల ద్వారా డిజిటల్, వర్చువల్ విధానంలో సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించనున్నారు.

# డోన్ లో బి .ఎల్ .ఏ లతో సమావేశమైన ఎమ్మెల్యే కోట్ల







డోన్ టౌన్, జూన్ 29,(సీమ కిరణం న్యూస్): డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ రోజు సోమవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్.) కార్యక్రమానికి సంబంధించి డోన్ పట్టణ మరియు మండల క్లస్టర్, యూనిట్, ఇన్‌చార్జ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లు బి ఎల్ ఎ లుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డోన్ ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని నిర్దేశించిన గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన దరఖాస్తులను వెంటనే పూర్తి చేసి సమర్పించాలనిఆదేశించారు. క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు , బి ఎల్ ఎ లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి రోజూ పురోగతిని సమీక్షించుకోవాలని, ప్రతి బూత్‌లో నిర్ణీత లక్ష్యాలను పూర్తి చేసి ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బి ఎల్ ఎబాధ్యతగా వ్యవహరించి ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పనిచేయాలని సూచించారు.

# మూడో వార్డులో రోడ్డుపైనే డ్రైనేజీ నీరు..







**పట్టించుకునే నాథుడే లేరా?**

**నాయకుడి ఇంటి వద్దే దారుణ పరిస్థితి..**

**సామాన్యుల కష్టాలు వర్ణనాతీతం**

**పంచాయతీ సెక్రటరీ లేకపోవడంతో నిలిచిన పనులు..**

వెల్దుర్తి, జూన్ 29, (సీమకిరణం న్యూస్): కర్నూలు జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని మూడో వార్డులో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీ నీరు రోడ్లపైకి వచ్చి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఓ సీనియర్ నాయకుడి ఇంటి సమీపంలోనే ఈ దారుణ పరిస్థితి నెలకొనడం పట్ల ప్రజలు తీవ్ర ఆశ్చర్యం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు."ఊరికే పెద్ద దిక్కుగా ఉండే సీనియర్ నాయకుడి ఇంటి ముందే పరిస్థితి ఇలా ఉంటే, ఇక సామాన్య ప్రజల వీధుల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో?" అని స్థానికులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు.

**ప్రబలుతున్న వ్యాధులు.. వాహనదారుల నరకం**

డ్రైనేజీ నీరు రోడ్డుపైనే నిల్వ ఉండిపోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి తోడు దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ జ్వరాలు, ఇతర అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ దారి గుండా ప్రయాణించే చిన్నారులు, వృద్ధులు, పాదచారులు మరియు వాహనదారులు మురుగునీటిలోనే ప్రయాణించాల్సి వస్తోందని, నరకయాతన అనుభవిస్తున్నామని వాపోతున్నారు.

**పట్టించుకోని పంచాయతీ అధికారులు**

ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం పంచాయతీ సెక్రటరీ అందుబాటులో లేకపోవడంతో సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి : ప్రజల డిమాండ్**

ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, వెల్దుర్తి మూడో వార్డులో నిలిచిపోయిన మురుగు నీటిని తొలగించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, ప్రజారోగ్యాన్ని కాపాడాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను 5రోజుల్లోపు పూర్తిచేయాలి

**ప్రజలకు మంచి సేవలందించి సానుకూల ప్రజాభిప్రాయం (Positive Public Perception) పెంపొందించేలా కృషి చేయాలి**

**ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు**

**ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి**

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



కర్నూలు, (సీమకిరణం న్యూస్):జూన్ 29: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను 5రోజుల్లోపు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి పిజిఆర్ఎస్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు సంబంధించి ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతి ఆదేశాన్ని, ప్రతి గడువును ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుందన్నారు. వారు ఇచ్చిన టైమ్‌టేబుల్ ప్రకారం ఏ నివేదికను ఏ రోజు, ఏ సమయానికి సమర్పించాలో, అదే రోజు, అదే సమయానికి సమర్పించాలన్నారు. ఎన్నికల సంఘానికి సంబంధించిన పనుల్లో మాత్రం ఎలాంటి నిర్లక్ష్యానికీ అవకాశం ఉండకూడదన్నారు.. జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ పనిని చాలా వరకు సమర్థవంతంగా పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియలో పురోగతి శాతం తక్కువగా ఉందని, శనివారంలోపు ఈ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్‌లో ప్రతిరోజూ కనీసం 10 శాతం పురోగతి సాధించాలని కలెక్టర్ ఈ ఆర్వో లు, ఏ ఈ ఆర్వో లను ఆదేశించారు.. నిరంతరం బి ఎల్ వో లతో సమీక్షిస్తూ, పురోగతి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ కు సంబంధించి అన్ని శాఖల అధికారులు ప్రజలకు మంచి సేవలందించి సానుకూల ప్రజాభిప్రాయం **(Positive Public Perception)** పెంపొందించేలా కృషి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.. రెవెన్యూ, సర్వే, డీపీఓ, జీఎస్‌డబ్ల్యూఎస్, డీఆర్డీఏ, డిటిసి, సంక్షేమ వసతి గృహాలు, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్ డబ్ల్యూ ఎస్, హార్టికల్చర్, దీపం, స్వర్ణ గ్రామం,స్వర్ణ వార్డు తదితర శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రతి శాఖ తమ పనితీరును ప్రస్తుతం ఉన్న శాతం నుండి కనీసం 10 శాతం మెరుగుపరచి, ప్రజల సంతృప్తి స్థాయిని 80 శాతానికి పైగా తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. హార్టికల్చర్ శాఖకు సంబంధించి సాగునీరు అందుబాటులో ఉన్న భూముల్లో ఉద్యాన పంటల విస్తరణ పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, నీటిపారుదల సౌకర్యం ఉన్న భూముల్లో ఉద్యాన పంటల విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ జిల్లా ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. పిజిఆర్ఎస్ కు సంబంధించి జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రా+వా)ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్వే, రెవెన్యూ శాఖల అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, వీఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు సమన్వయంతో పనిచేసి ఫిర్యాదులను నిర్ణీత గడువులో నాణ్యతతో పరిష్కరించాలన్నారు. గత రెండేళ్లుగా పీజీఆర్ఎస్ విధివిధానాలు (గ్రా+వా)పై పలుమార్లు శిక్షణలు, సూచనలు ఇచ్చినప్పటికీ ఇంకా నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. 40 రోజుల గ్రా+వా గడువులో చివరి రోజుల్లో మాత్రమే ఫిర్యాదులను తెరిచి, సంబంధం లేని ఎండార్స్‌మెంట్‌ల తో మూసివేస్తున్న సంఘటనలు జరుగుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ సర్వేయర్లు నోటీసులు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకపోవడం, సర్వే అనంతరం నివేదికలను సమర్పించ కపోవడం వంటి అంశాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ పరిస్థితిని ఇకపై సహించ బోమని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు .పీజీఆర్ఎస్, భూ రికార్డుల నిర్వహణ **(ROR)**లో జిల్లా పనితీరు మెరుగుపడేలా ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే తహసీల్దార్లు, వీఆర్ఓలు తదితర అధికారులపై చర్యలకు సంబంధించిన ఫైళ్లను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ డీఆర్ఓను ఆదేశించారు.. ప్రతిరోజూ కొత్తగా వచ్చిన ఫిర్యాదులు, గ్రా+వా గడువులో ఉన్న కేసులను పరిశీలించి, అదే రోజు వాటిని ఓపెన్ చేసి సంబంధిత పిటిషనర్‌తో మాట్లాడాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత , అనురాధ, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, డ్వామా పిడి నరసింహ రెడ్డి, ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డులో ప్రతిభ చాటిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు








ప్యాపిలి, జూన్ 29 (సీమ కిరణం న్యూస్) : జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల (బాయ్స్), ప్యాపిలికి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు పోటీలలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. గత నెలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు పోటీలలో పాఠశాల విద్యార్థి అబ్దుల్ గఫూర్ రూపొందించిన "మస్కిటో ట్రాపర్" ఎగ్జిబిట్, మరో విద్యార్థి కృష్ణ రూపొందించిన "డ్రైనేజ్ కెనాల్ క్లీనర్" ఎగ్జిబిట్ విశేషంగా ఆకట్టుకుని రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు పోటీలకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మబాయి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. అలాగే ఈ ప్రాజెక్టులకు మార్గదర్శకత్వం వహించిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వై. శేఖర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. తల్లితండ్రులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర స్థాయి పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# ఆయుష్మాన్ భవ పోస్టర్లను విడుదల



డోన్ టౌన్, జూన్ 29,(సీమ కిరణం న్యూస్):డోన్ మున్సిపల్ కార్యాలయం నందు ఆయుష్మాన్ భవ పోస్టర్లను విడుదల చేసిన మునిసిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్. ఇకపై మునిసిపాలిటీ మరియు ఆయుష్మాన్ భవ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం నందు ప్రతి సోమవారం ప్రజలకు డాక్టర్ గ్రేస్ ఉచితంగా ఆయుర్వేద ట్రీట్మెంటు మరియు మందుల పంపిణీ చేయడం జరుగునని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ద్రోణాచలం సేవా సమితి ఆధ్వర్యంలో చిన్న పిల్లల చదువుకు ఆర్థిక సహాయం అందజేత



డోన్ టౌన్, జూన్ 29,(సీమ కిరణం న్యూస్): గతంలో యాక్సిడెంట్ లో మరణించిన చాకలి గిరి కుటుంబానికి ద్రోణాచలం సేవా సమితి ఆసరాగా ఉన్న విషయం అందరికి తెలిసినదే అతని పిల్లల చదువు భారం సేవా సమితి తీసుకున్నది అందులో భాగంగా డోన్ కు చెందిన కీర్తిశేషులు సబ్బుల సుబ్బయ్య కుమారుడు మురళి పిల్లల లో ఒకరి కి సంబంధించిన ఫీజు, పుస్తకాలు, యూనిఫామ్ కు అయ్యే ఖర్చు మొత్తం 12000 రూపాయలు రాధాకృష్ణన్ స్కూల్ లో చాకలి గిరి భార్య చేతికి అందజేయడం జరిగినది పిల్లల ఫీజు విషయంలో తమ వంతు సహాయంగా చాలా తక్కువ ఫీజు తీసుకున్న రాధాకృష్ణన్ స్కూల్ కరెస్పాండంట్ పురుషోత్తం గారికి ప్రత్యేక ధన్యవాదములు అలాగే పిల్లల చదువుకు అక్షర సహాయం అందించిన దాత మురళి కి ధన్యవాదములు. ఈ కార్యక్రమం లో షాదీఖానా రాజా,గురుస్వామి, సుధాకర్,ఫోటోగ్రాఫర్ బాబా,శివారెడ్డి,అఖిల్ కుమార్,సిద్దు యాసిర్,స్కూల్ స్టాఫ్ పాల్గొన్నారు

# ఆకాశం వైపు రైతుల చూపు

**వర్షాలు లేక మండలంలో రైతుల ఇబ్బందులు**



ప్యాపిలి జూన్ 29 (సీమ కిరణం న్యూస్): మండలంలో సరైన వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగు చేసిన పంటలు నీటి కొరతతో ఎండుముఖం పట్టగా, మరికొందరు రైతులు విత్తనాలు వేసేందుకు కూడా వెనుకాడుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండల కారణంగా పొలాల్లో తేమ పూర్తిగా తగ్గిపోయింది. దీంతో రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా జీవిస్తున్న రైతులు వర్షాలు కురవకపోవడంతో ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రైతులకు అవసరమైన సూచనలు, సహాయ సహకారాలు అందించాలని రైతులు కోరుతున్నారు. వర్షాలు కురిసి పంటలు పచ్చగా కళకళలాడాలని మండల రైతులు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.

## మహిళా రైతును ఘనంగా సన్మానించిన హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ



వెల్దుర్తి,జూన్ 29, (సీమకిరణం న్యూస్) : వెల్దుర్తి మండలం అనంతపురం జిల్లా గుత్తి మార్నేపల్లి గ్రామ శివారులో ప్రకృతి వ్యవసాయం కోసం గో సేవ కోసం ఆయుర్వేదిక వైద్యం కోసం అమెరికాలోని తన వైద్య వృత్తిని వదులుకొని దాదాపుగా 40 ఎకరాల్లో వ్యవసాయాన్ని చేస్తున్న మహిళా రైతును ఏరువాక పౌర్ణమి సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు హరిసింహనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు హరి సింహనాయుడు మాట్లాడుతూ అనంతపురం జిల్లా గుత్తి మార్నేపల్లి గ్రామ సమీపంలో తమ సొంత వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ రుషి గోసేవ ఆశ్రమం ఏర్పాటు చేసిన డాక్టర్ మాధవి ప్రకృతి వ్యవసాయం మీద ప్రేమతో గోబర్ గ్యాస్ తయారు చేస్తూ వినియోగిస్తూ ఎన్నో అరుదైన పుష్పజాతులను పండ్ల జాతులను వృక్షాలను సంరక్షిస్తూ వృక్షాలను పెంచాలని ఎందరికో అవగాహన కల్పిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, డాక్టర్ మాధవి త్వరలోనే ప్రపంచంలోనే అరుదైన వైద్యులచే ప్రకృతి వైద్యం కూడా అనేక రుగ్మతలకు, మొండి రోగాలకు అందించనున్నారని అందుకే డాక్టర్ మాధవిని హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ తరఫున వ్యవసాయ క్షేత్రం రుషి ఆశ్రమంలో కలిసి ఆమెను హృదయపూర్వకంగా అభినందించి ఘనంగా సన్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు హరి సింహానాయుడు మరియు వైద్యం రామనాయుడు స్ఫూర్తి సేవా సంస్థ ఆర్యన్ మధు , మహానంది పాల్గొన్నారు.

### లక్ష కోట్ల అవినీతి అన్న రేవంత్ రెడ్డి...

## అతనిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?




మేఘా కృష్ణారెడ్డి ఇప్పుడు రేవంత్ రెడ్డికి బెస్ట్ ఫ్రెండ్ అయ్యాడని విమర్శ దమ్మంటే కృష్ణారెడ్డిని అరెస్ట్ చేయాలని సవాల్అదానీ, అంబానీలను బిలియనీర్లుగా చేసింది కాంగ్రెస్సే అన్న పాల్కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని, సీబీఐ విచారణ జరిపించాలని గతంలో డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి... ముఖ్యమంత్రి అయ్యాక మేఘా కృష్ణారెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రశ్నించారు. గురువారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది అయిందని... కానీ మేఘా కృష్ణారెడ్డి ఇప్పుడు సీఎంకు బెస్ట్ ఫ్రెండ్ అయ్యాడని ఆరోపించారు. కాంగ్రెస్ ఎప్పుడూ ద్వంద్వ విధానాలను పాటిస్తుందని విమర్శించారు.కాళేశ్వరం అవినీతిపై కాగ్ నివేదిక తేటతెల్లం చేసిందని, ఈ ప్రభుత్వానికి దమ్మంటే కృష్ణారెడ్డిని అరెస్ట్ చేయాలని సవాల్ చేశారు. ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటేనే సత్వర న్యాయం జరుగుతుందని, కోర్టు విచారణలతో ఏళ్లు పడుతుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను తాను కోర్టు ద్వారా నిలువరించానన్నారు. అవినీతి, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని తాను న్యాయ పోరాటం చేస్తున్నానన్నారు. ప్రజలు తన పోరాటానికి మద్దతు పలకాలన్నారు.

**అదానీ, అంబానీలను బిలియనీర్లుగా చేసింది కాంగ్రెస్సే**

అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ, రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీలను బిలియనీర్లుగా చేసిందే కాంగ్రెస్ పార్టీ అని కేఏ పాల్ విమర్శించారు. ఇప్పుడు అదే అదానీని అరెస్ట్ చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది కాంగ్రెస్ ద్వంద్వ విధానాలకు నిదర్శనమన్నారు.

### నోటిఫికేషన్ ఇవ్వకుండానే

## ఉద్యోగాలు ఇచ్చామని రేవంత్ రెడ్డి గోబెల్స్ ప్రచారం

నోటిఫికేషన్లు ఇవ్వకుండానే 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని గోబెల్స్ ప్రచారం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి... ఇప్పుడు తొమ్మిది నెలలు శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరబోతున్న 8,047 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలను కూడా తన ఖాతాలో వేసుకుంటాడేమోనని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన పోలీసు పరీక్షల్లో ఎంపికై, ఉద్యోగాలు పొంది తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకొని, 8,047 మంది పోలీస్ కానిస్టేబుళ్లు విధుల్లో చేరబోతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఆ కానిస్టేబుళ్లకు హరీశ్ రావు శుభాకాంక్షలు చెప్పారు.నీతి, నిజాయతీలతో వ్యవహరిస్తూ, శాంతిభద్రతలు కాపాడడంలో నిమగ్నం కావాలని, ఉద్యోగ నిర్వహణలో రోల్ మోడల్గా నిలవాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు.

### హైకోర్టులో బీఆర్ఎస్కు భారీ ఊరట...

## పాలమూరు ధర్నాకు అనుమతి

ఈ నెల 25న తలపెట్టిన మహా ధర్నాకు హైకోర్టు అనుమతివెయ్యి మంది రైతులతో ధర్నాకు అనుమతించిన హైకోర్టు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన, రైతు ధర్నా చేపట్టాలని బీఆర్ఎస్ నిర్ణయంతెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్కు భారీ ఊరట లభించింది. మహబూబాబాద్లో ఈ నెల 25న ఉదయం పది గంటలకు నిర్వహించ తలపెట్టిన మహా ధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. వెయ్యి మంది రైతులతో ధర్నా నిర్వహించేందుకు బీఆర్ఎస్కు కోర్టు అనుమతించింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన, రైతు ధర్నాను ఈరోజు (నేడు) చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. కానీ పోలీసులు అనుమతించలేదు. దీంతో ఈ నెల 25న చేపట్టాలని నిర్ణయించింది. ఈ గిరిజన, రైతు ధర్నాకు అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టులో ప్రతిపక్షానికి అనుకూలంగా తీర్పు వచ్చింది.

## వర్మపై మరో కేసు నమోదు

చంద్రబాబు, పవన్, లోకేశ్ ల మార్ఫింగ్ ఫొటోల కేసుకేసు నమోదు చేసిన రావికమతం పోలీసులు విచారణకు హాజరు కావాలంటూ నోటీసులుసినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ఇబ్బందులు పెరుగుతున్నాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ ల మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, వారిని కించపరిచేలా కామెంట్లు చేసిన అంశంలో ఇప్పటికే ఆయనపై ప్రకాశం జిల్లాలో కేసు నమోదయింది. నవంబర్ 20న ఒంగోలు రూరల్ పీఎస్ లో విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. అయితే, షూటింగ్ లో బిజీగా ఉన్నానని, విచారణకు హాజరు కావడానికి తనకు కొంత సమయం కావాలని వర్మ కోరారు. దీంతో నవంబర్ 25న విచారణకు హాజరు కావాలని నిన్న మరోసారి నోటీసులు ఇచ్చారు. మరోవైపు, ఆయనపై మరో కేసు కూడా నమోదయింది. అనకాపల్లి జిల్లా రావికమతం పోలీసులు వర్మపై కేసు నమోదు చేశారు. చంద్రబాబు, పవన్, లోకేశ్ లపై మార్ఫింగ్ ఫొటోలకు సంబంధించే ఈ కేసు కూడా నమోదయింది. ఈరోజు (21న) విచారణకు హాజరు కావాలంటూ రావికమతం పోలీసులు నోటీసులు ఇచ్చారు. అయితే విచారణకు హాజరయ్యేందుకు వర్మ మరో వారం రోజులు సమయం కోరినట్టు తెలుస్తోంది.

### లగచర్ల ఘటన.. పోలీసులపై

## హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్




హైదరాబాద్, నవంబర్ 21: లగచర్ల ఘటనలో పోలీసులపై హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా తన భర్త పట్నం నరేందర్ రెడ్డి అరెస్టు జరిగిందని పట్నం శ్రుతి హైకోర్టులో పిటిషన్ ధాఖలు చేశారు. పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని పిటిషన్లో పేర్కొన్నారు. ఒక వ్యక్తిని అరెస్టు చేసే సమయంలో అనుసరించాల్సిన నిబంధనలు పాటించలేదని పిటిషనర్ పేర్కొన్నారు. డీ.కే బసు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పిటిషన్లో శ్రుతి పేర్కొన్నారు. ప్రతివాదులుగా ఐజీ వి.సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ కె. నారాయణరెడ్డి, బొమ్మరాస్పేట ఇన్స్పెక్టర్ శ్రీధర్రెడ్డి, ఎస్సై మహమ్మద్ అబ్దుల్ రవూఫ్ పిటిషనర్ చేర్చారు. ప్రతివాదులుగా ఉన్న పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంటూ పట్నం శ్రుతి కోరారు. ఈ పిటిషన్ను హైకోర్టు రేపు(శుక్రవారం) విచారించే అవకాశం కనిపిస్తోంది.కాగా.. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్పై దాడి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ దాడిలో పాల్గొన్న నిందితుల్లో ఒకరు.. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్రెడ్డితో ఎక్కువసార్లు ఫోన్లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఈ కేసులో మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్లోని కేబీఆర్ పార్క్లో మార్నింగ్ వాక్ చేస్తుండగా ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం చర్లపల్లి జైల్లో నరేందర్ రెడ్డి ఉన్నారు.అయితే అరెస్ట్ సమయంలో పోలీసులు కనీస నిబంధనలు పాటించలేదంటూ పట్నం నరేందర్ రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ను దాఖలు చేశారు. దీనిపై నిన్న(బుధవారం) వాదనలు ముగిశాయి. కాగా తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. నరేందర్ రెడ్డి తరపున గండ్ర మోహన్ రావు వాదనలు వినిపించారు. అరెస్టు సమయంలో పోలీసులు కనీస నిబంధనలు పాటించలేదని తెలిపారు. హత్యాయత్నం కేసు తప్ప మిగిలిన సెక్షన్లన్నీ 5 సంవత్సరాలలోపు శిక్ష పడేవే అని చెప్పారు. ఘటన జరిగిన రోజు సురేష్తో పట్నం నరేందర్ ఎన్ని కాల్స్ మాట్లాడారు హైకోర్ట్ ప్రశ్నించింది. 71 డేస్లో 84 కాల్స్ ఉన్నందుకు అరెస్ట్ చేయడం సరికాదని న్యాయవాది తెలిపారు. అరెస్టు విషయాన్ని కనీసం కుటుంబసభ్యులకు కూడా చెప్పలేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పులను కింది కోర్ట్ కనీసం పరిగణలోకి తీసుకోలేదని.. అరెస్ట్ గ్రౌండ్స్ను చూడకుండానే పట్నం నరేందర్ రెడ్డికి రిమాండ్ విధించారని తెలిపారు. పట్నం నరేందర్ ది అక్రమ అరెస్ట్ అని న్యాయవాది వాదించారు. ఎక్కడ కూడా పోలీసులు లీగల్ ప్రొసీడింగ్స్ ఫాలో కాలేదన్నారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేశారన్నారు. 11వ తేదీ సంఘటన జరిగినప్పుడు నరేందర్ రెడ్డి అక్కడ లేరని.. సురేష్ అనే నిందితుడి కాల్ డేటా ఆధారంగా అరెస్ట్ చేశామని పోలీసులు చెబుతున్నారన్నారు. 11వ తేదీ కేవలం ఒకే ఒక సారి సురేష్తో నరేందర్ రెడ్డి ఫోన్లో మాట్లాడినట్లు చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పులను ఉల్లంఘించారని పిటిషనర్ తరపు న్యాయవాది గండ్ర మోహన్ రావు వాదనలు వినిపించారు.

**సీఎం రేవంత్ సంచలన నిర్ణయం**

లగచర్ల ఘటనలో ప్రభుత్వాన్ని అస్థిర పరించేందుకు కుట్ర చేశారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. కలెక్టర్ మీద, అధికారుల మీద దాడులు చేయించారని.. అన్నింటికీ ప్రధాన సూత్రధారి పట్నం నరేందర్ రెడ్డి అని వాదించారు. నరేందర్ రెడ్డికి సంబంధించి ఎలాంటి ఆధారాలు ఉన్నాయని హైకోర్టు ప్రశ్నించింది. తన అనుచరులతో కలిసి స్కెచ్ వేశారని కోర్టుకు పీపీ తెలియజేశారు. ఎవరు అనుచరులు.. అతని హోదా ఏంటి అని ధర్మాసనం మరో ప్రశ్న వేయగా.. సురేష్ అనే వ్యక్తి పట్నం నరేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడు అని తెలిపారు. సంఘటన జరిగిన రోజు సురేష్ ... నరేందర్ కాల్స్ మాట్లాడుకున్నారని చెప్పారు. అరెస్ట్ సందర్భంగా ఎలాంటి నియమాలు పాటించారని పీపీని హైకోర్టు అడిగింది. కేబీఆర్ పార్క్లో ఒక మాజీ ఎమ్మెల్యేను ఎలా అరెస్ట్ చేస్తారని ధర్మాసనం ప్రశ్నించగా... కేబీఆర్ పార్క్లో అరెస్ట్ చేయలేదని తన ఇంట్లో అరెస్ట్ చేశామని కోర్టుకు పీపీ తెలిపారు. వాదనలు ముగిసిన అనంతరం తీర్పును హైకోర్టు ధర్మాసనం రిజర్వ్ చేసింది.

## ప్రాణంపోతోంది రక్షించండని వేడుకున్నా.. కనికరించని జనం



హైదరాబాద్, నవంబర్ 21: "మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు" అంటూ ఓ రచయిత రాసిన ఈ పాట అక్షరాలా నిజమయ్యేలా కొన్ని సంఘటనలు సమాజంలో చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో బాధితులకు అండగా ఉండాల్సింది పోయి కొందరు చూసీ చూడనట్టుగా వ్యవహరించడంతో నిండు ప్రాణాలు బలైపోతున్నాయి. వారి ప్రాణాలు రక్షించడంలో సహాయం చేయకపోగా ఫోటోలు, వీడియోల పిచ్చితో మానవత్వం మంటగలిసేలా ప్రవర్తిస్తున్నారు కొందరు .ప్రాణంపోతోంది కాపాడండి మహాప్రభో అన్నా కూడా జనం చూస్తూ ఉన్నారే ఎవ్వరూ ముందుకు రాని పరిస్థితి. తాజాగా కీసర ఔటర్ రింగ్ రోడ్డు వద్ద జరిగి ఓ విషాద ఘటన అందరినీ కలిచివేసింది. తన ప్రాణాలు రక్షించాలని కోరుకున్నా.. చుట్టూ ఉన్న జనం చూస్తూ ఉన్నారే తప్ప ముందుకు రాలేదు. పైగా తామేదో మంచి పనిచేస్తున్నట్లు బాధతో విలవిలలాడుతున్న బాధితుడి ఫోటోలు, వీడియోలు తీయడంలో బిజీ అయ్యారు. దీంతో చూస్తూ ఉండగానే అతడి ప్రాణం గాల్లో కలిసిపోయింది.

**అసలేం జరిగిందంటే...**

కీసర ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో రాంపల్లి చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. వరంగల్కు చెందిన ఎలందర్ అనే వ్యక్తి స్కూటీపై వెళ్తుండగా రివర్స్లో వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో స్కూటీపై నుంచి ఎలందర్ కింద పడటంతో అతడి రెండు కాళ్లపై నుంచి లారీ వెళ్లింది. ప్రమాదంలో ఎలందర్ రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. రక్తపు మడుగులో ఎలందర్ నొప్పితో విలవిలలాడి పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి చుట్టుపక్కల జనం ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే నొప్పితో బాధపడుతున్న వ్యక్తిని ఏమాత్రం పట్టించుకోకుండా తమ పని తాము చేసుకుంటూ పోయారు. ప్రాణంపోతోంది రక్షించండి అని వేడుకున్నా కూడా వీడియో, ఫోటోలు తీసుకుంటూ జనం.. అతడికి సహాయం చేయలేదు. దీంతో జనాల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైంది .నొప్పితో అల్లాడుతూ తనను కాపాడమని బాధితుడు వేడుకున్నాడు. అయినప్పటికీ జనం కనికరించకుండా ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ ఉండిపోయారు. 108 వెహికల్ వచ్చే వరకు కూడా జనం ఫోటోలు, వీడియోలతో కాలక్షేపం చేశారు. అంబులెన్స్ వచ్చి ఎలందర్ను ఆస్పత్రికి తరలించేలోపే ఘోరం జరిగిపోయింది. రోడ్డు ప్రమాదం జరిగి చాలా సేపు అవడంతో పాటు, సరైన సమయానికి ఆస్పత్రికి తరలించకపోవడంతో ఎలందర్ మార్గమధ్యలోనే ప్రాణాలు విడిచారు. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించి వీడియోను పలువురు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది కాస్తా వైరల్గా మారింది. ఈ హృదయ విదారకర ఘటనను చూసి పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాద బాధితుడిని పట్టించు కోకుండా వీడియోలు తీసిన జనంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నేను కూడా రాజీనామా చేసి వెళ్ళాలనుకున్నా




హైదరాబాద్, నవంబర్ 21: తెలంగాణ వ్యాప్తంగా 8,047 మంది పోలీస్ కానిస్టేబుల్స్ శిక్షణ పొందారని.. ఇందులో 4,100 సివిల్, 3,685 మంది ఏఆర్ 2,028 కమ్యూనికేషన్స్, 18 మంది పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఉన్నారని సీపీ సీవీ ఆనంద్ (%జూ జు చాఅఖుఅ%) తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇందులో నుంచి హైదరాబాద్ పోలీస్ శాఖకు 1,128 మందిని ట్రైనింగ్ కోసం కేటాయించినట్లు చెప్పారు. ఇప్పుడు 747 మంది దీక్షత్ పాసింగ్ అవుట్ పరేడ్ చేశారన్నారు. 3,081 మంది మహిళల కానిస్టేబుల్స్ పోలీస్ శిక్షణ పొందారన్నారు."1992లో నేను ఐపీఎస్ శిక్షణ పొందాను పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. అప్పుడు 80 మంది ట్రైనీ ఐపీఎస్లు పాల్గొన్నాం. వర్షం పడుతున్నా పరేడ్ పూర్తి చేశాం" అంటూ ఆనాటి విషయాలను గుర్తుచేశారు సీపీ. శిక్షణ పొంది పోలీస్ శాఖలో 35 ఏళ్లు గడపబోతున్నారని... శిక్షణ పొందిన వారు అకుంటిత దీక్షతో పని చేయాలని సూచించారు. పోలీసులు రాజ్యాంగానికి విధేయత చూపాలన్నారు. పోలీసులు నిజాయితీగా, న్యాయంగా పనిచేయాలని తెలిపారు. ప్రజల మాన, ప్రాణాలు కాపాడడంలో కర్తవ్యం నెరవేర్చాలని స్పష్టం చేశారు. పోలీస్ డ్యూటీ అంటే ఒత్తిడితో కూడుకున్నదని ఆయన తెలిపారు.

పోలీసులకు ముఖ్య సూచన...

అలాగే పోలీసులకు సీపీ ముఖ్య సూచన చేశారు. పోలీసులు తాగుడుకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. యువ పోలీసులు ఫిజికల్ ఫిట్నెస్గా ఉండాలని.. దేనికి ఏ వ్యసనానికి కూడా లొంగకూడదని.. బానిస కాకూడదని తెలిపారు. "నా 33 ఏళ్ల పోలీస్ సర్వీస్లో 75 కేజీల మధ్యలో ఉన్నాను. నేను చాలా ఫిట్గా ఉన్నాను. 30 ఏళ్ల క్రితం నా ఐపీఎస్ పాసింగ్ అవుట్ పరేడ్లో వేసుకున్న పోలీస్ డ్రెస్ ఇప్పుడు కూడా వేసుకోగలను. మీరు శిక్షణ పొందిన పేట్లబురుజు ఆర్మ్ రిజర్వ్ ఇన్చార్జ్ డీసీపీ దక్షిణామూర్తిని చూడండి ఎంత ఫిట్గా ఉన్నారో. ఫిట్గా ఉన్న వారిని ఆదర్శంగా తీసుకోండి. పోలీసుల జీతాల విషయంలో ప్రభుత్వం ఎక్కువగా పెంచదు. పోలీసులు అవినీతికి పాల్పడకూడదు. ఐపీఎస్ లాంటి ఉద్యోగంలో కూడా జీతాలు అంతంత మాత్రమే. పోలీస్ శాఖలో మెల్లమెల్లగా జీతాలు పెరుగుతూనే ఉంటాయి. పోలీస్ ఉద్యోగం అంటే టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లాంటిది. ఒక పరిస్థితిలో నేను కూడా రాజీనామా చేసి వెళ్ళలనుకున్నా. శిక్షణ తీసుకున్నవారు మీ సేవల ద్వారా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురండి" అంటూ సీపీ ఆనంద్ పేర్కొన్నారు.

తెలంగాణలో స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ 9 నెలల శిక్షణ పూర్తి..

కాగా.. తెలంగాణా పోలీస్ అకాడమీలో కానిస్టేబుల్స్ నాలుగవ పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీజీపీ జితేందర్, పోలీసులు ఉన్నతాధికారులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఆర్, సివిల్, ఎస్ఏఆర్సీపీఎల్, ఐటీ, సీఏఎన్పీటీఓ విభాగాలకు చెందిన 8,047 మంది స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ శిక్షణ విజయవంతమైంది. ఫిబ్రవరి21, 2024లో స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ శిక్షణ మొదలైంది. రాష్ట్రంలో మొత్తం 19 ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్లో శిక్షణ జరిగింది. కానిస్టేబుల్ శిక్షణ పొందిన వారిలో 5709 పురుషులు, 2338 మహిళ అభ్యర్థులు ఉన్నారు. ట్రైనీ కానిస్టేబుల్స్కు సమగ్రంగా అన్ని అంశాలపై శిక్షణ పూర్తి అయ్యింది. సివిల్, క్రిమినల్, సైబర్ కేసులు, ఎన్డీపీఎస్ యాక్ట్, క్రైమ్, సెల్ఫ్ డిఫెన్స్ ఇలా చాలా అంశాలపై ట్రైనింగ్ జరిగింది. కానిస్టేబుల్స్లో గ్రాడ్యుయేషన్ 5470 , పోస్ట్ గ్రాడ్యుయేషన్ 1361 చదివిన వారు ఉన్నారు. ఇందులో టెక్నికల్1755, నాన్ టెక్నికల్ 5505, లా పూర్తి చేసుకున్న వారు 15 మంది ఉన్నారు. నేడు పాసింగ్ ఔట్ పరేడ్ తరువాత తెలంగాణ పౌరుల సేవలో 8,047 మంది కానిస్టేబుల్స్ పాల్గొననున్నారు.

## కొండ సురేఖ వ్యాఖ్యలపై నాగార్జున కుటుంబం క్షోభించింది

హైదరాబాద్: అక్కినేని నాగచైతన్య , సమంత విడిపోవడానికి మాజీ మంత్రి కేటీఆర్ కారణమంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఎంతటి దుమారాన్ని రేపాయో అందరికీ తెలిసిందే. మంత్రి వ్యాఖ్యలను అక్కినేని నాగార్జున తీవ్రంగా ఖండించారు. సినీ ఇండస్ట్రీ మొత్తం మంత్రి వ్యాఖ్యలను తప్పుబట్టింది. చివరకు కొండా సురేఖ వ్యాఖ్యలపై నాంపల్లి కోర్టును ఆశ్రయించారు నాగార్జున. క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రోజు (గురువారం) నాంపల్లి కోర్టులో పిటిషన్ విచారణ జరిగింది. ప్రొసిజర్ ప్రకారం పిటిషనర్ వాంగ్మూలాన్ని న్యాయస్థానం రికార్డు చేసింది. నాగార్జున స్టేట్మెంట్ తర్వాత సాక్షుల స్టేట్మెంట్లను రికార్డ్ చేసింది.అయితే.. మంత్రి కొండా సురేఖపై నాగార్జున పరువు నష్ట దావా వేశారు. పరువు నష్ట దావాలో ఇప్పటికే మంత్రి కొండా సురేఖ కౌంటర్ దాఖలు చేశారు. నాంపల్లి స్పెషల్ కోర్టులో న్యాయవాది గురుమిత్ సింగ్ కౌంటర్ దాఖలు చేశారు. కౌంటర్పై కొండా సురేఖ తరుపు న్యాయవాది ఈరోజు వాదనలు వినిపించారు.

**నాగార్జున కుటుంబం కుంగిపోయింది..**

"కొండ సురేఖ నాగార్జునపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసింది. ఆ తర్వాత ట్విట్టర్లో క్షమాపణ కోరుతూ పోస్ట్ చేసింది. ట్విట్టర్లో మంత్రి కొండా సురేఖ పెట్టిన పోస్ట్ను కోర్ట్ ముందు నాగార్జున తరుపు న్యాయవాది అశోక్ రెడ్డి చదివి వినిపించారు. నా వ్యాఖ్యల పట్ల మీరు కానీ, మీ అభిమానులు కానీ మనస్తాపానికి గురైనట్లయితే బేషరతుగా నా వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నాను, అన్యద భావించవద్దని కొండా సురేఖ ట్విట్ చేసింది. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి ఇలాంటి కామెంట్స్ చేయడం సరైంది కాదు. కచ్చితంగా కొండా సురేఖ క్రిమినల్ చర్యలకు అర్హురాలు. ఈ కామెంట్స్తో నాగార్జున కుటుంబం మానసికంగా ఎంతో



కుంగిపోయారు" అని నాగార్జున తరపు న్యాయవాది అశోక్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు.

**నాగార్జున ఏమన్నారంటే..**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్పై ఆరోపణలు గుప్పిస్తూ.. అక్కినేని కుటుంబాన్ని ప్రస్తావించి మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై హీరో అక్కినేని నాగార్జున స్పందించారు. కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని ప్రకటించారు. "రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలను, మీ ప్రత్యర్థుల్ని విమర్శించేందుకు వాడుకోకండి. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలను గౌరవించండి. బాధ్యత కలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను" అని నాగార్జున అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. బాధ్యతగల మంత్రి పదవిలో ఉండి.. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధారమైన, అవాస్తవ వ్యాఖ్యలు చేసిన ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్న కొండా సేరేఖ**

మరోవైపు.. తన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగిన నేపథ్యంలో.. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు మంత్రి కొండా సురేఖ ప్రకటించిన విషయం తెలిసిందే. "అనుకోని సందర్భంలో.. అనుకోకుండా ఓ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. కేటీఆర్ నన్ను కించపరిచే విధంగా మాట్లాడారు. ఆ మాటలతో వేదనకు గురై ఆయన గురించి వ్యాఖ్యలు చేసే క్రమంలో అనుకోకుండా నాగార్జున కుటుంబం గురించి మాట్లాడా. ఆ వ్యాఖ్యలను నేను వెనక్కి తీసుకుంటున్నా. కానీ కేటీఆర్పై చేసిన వ్యాఖ్యల విషయంలో మాత్రం వెనక్కు తగ్గేది లేదు" అని కొండా సురేఖ స్పష్టం చేశారు.తాను వ్యాఖ్యలు చేసిన తర్వాత ఎక్స్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ఆ కుటుంబం ఆవేదనతో చేసిన పోస్టులు చూసి తనకు బాధ అనిపించిందని, ఆ కుటుంబాన్ని తన వాఖ్యలు నొప్పించాయని తెలిసి బాధ పడ్డానని పేర్కొన్నారు. తాను పడిన బాధ వాళ్లు పడకూడదనే ఉద్దేశంతో.. తన వాఖ్యలను వెనక్కి తీసుకుంటూ తాను కూడా ఎక్స్లో పోస్టు చేశానని తెలిపారు. కేటీఆర్ తనను మరింత రెచ్చగొడుతున్నారని ఆమె మండిపడ్డారు. "కేటీఆర్కు నేను క్షమాపణ చెప్పడమేంటని.. ఆయనే నాకు క్షమాపణలు చెప్పాలి" అని డిమాండ్ చేశారు. దొంగే 'దొంగా దొంగా' అన్నట్టుగా కేటీఆర్ ప్రవర్తన ఉందని.. ఆయన తనపై పెట్టించిన పోస్టులన్నింటినీ తొలగించాలని దుయ్యబట్టారు. తన కంటే ముందు.. మంత్రి సీతక్కపై ఇంకా ఘోరంగా ట్రోల్ చేశారని ఆవేదన వెలిబుచ్చారు. మహిళలను ట్రోల్ చెయ్యొద్దని బీఆర్ఎస్కు హితవు పలికిన ఆమె.. "కేటీఆర్ నీకు మహిళలు పనికిమాలిన వాళ్లలా కనిపిస్తున్నారా? మీ కుటుంబ సభ్యులే మహిళలా? నీ నోరు ఏ యాసిడ్తో కడగాలి?" అంటూ నిప్పులు చెరిగారు.

**వారిని కేటీఆర్ దుబాయ్లో దాచి పెట్టారు..**

తనను ట్రోల్ చేసినవారిని కేటీఆర్ దుబాయ్లో దాచి పెట్టారని ఆరోపించారు. వెంటనే వారిని తీసుకొచ్చి అప్పగించాలని డిమాండ్ చేశారు. సినీ పెద్దల స్పందన వెనుక బీఆర్ఎస్ నేతలు ఉన్నారో, లేదో తనకు తెలియదన్నారు. కేటీఆర్ ఇచ్చిన నోటీసులను తాను లీగల్గా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతండడంతో పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. దీనిపై వివరణ ఇవ్వాలని సురేఖకు సూచించారు. దీంతో తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నట్లు కొండా సురేఖ ట్వీట్ చేశారు. "నా వ్యాఖ్యల ఉద్దేశం మహిళల పట్ల ఒక నాయకుడి ధోరణిని ప్రశ్నించడమే తప్పు.. సమంతా, మీ మనోభావాలను దెబ్బతీయడం కాదు" అని స్పష్టం చేశారు. "స్వయం శక్తితో మీరు ఎదిగిన తీరు నాకు కేవలం అభిమానమే కాదు.. ఆదర్శం కూడా" అని మంత్రి కొండా సురేఖ వెల్లడించారు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com